

తేరుకోని కళత్తూరు

● ముంపుగ్రామాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు



కళత్తూరులో మురుగునీటిలోనే సామాన్లు శుభ్రం చేస్తున్న బాధితులు



బాధితులకు సాయం అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ఆదిమూలం, టీడీపీ నేతలు

కేవీబీపురం/సత్యవేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జల ప్రళయం సృష్టించిన బీభత్సం నుంచి కళత్తూరు దళితవాడవాసులు ఇంకా తేరుకోలేదు. ఇళ్లల్లో బురద పేరుకుపోయి కొందరు, ధాన్యం, సామగ్రి పాడై మరికొందరు, దుస్తులు కొట్టుకు పోయి ఇంకొందరు.. ఇలా వీరి పరిస్థితి దైన్యంగా మారింది. ఒకవైపు సహాయక చర్యలు జరుగుతుంటే.. మరోవైపు సర్వం కోల్పోయిన బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కేవీబీపురం మండలం పాతపాళెం రాయల చెరువు గురువారం ఉదయం తెగడంతో పాతపాళెం దళితవాడ, అరుంధతివాడ, ఓళ్లూరు దళితవాడ, కళత్తూరు దళితవాడల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా ప్రాంతాల్లో శుక్రవారం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. నారాయణవనం, పిచ్చాటూరు, వరదయ్యపాళెం, సత్యవేడు, వడమాలపేట పంచాయతీలు.. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ.. తిరుపతి కార్పొరేషన్ నుంచి 200 మందికి పైగా పారిశుధ్య సిబ్బంది.. శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, తిరుపతి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో వీధుల్లో, ఇళ్లల్లో పేరుకుపోయిన బురద తొలగిస్తున్నారు. బురద తీసేందుకు 10 ఎక్స్‌కవేటర్లు వినియోగిస్తున్నారు. ఇళ్లల్లో బురద తీసేవరకు వండుకునే పరిస్థితిలేదు. ఇప్పటికే బురద వల్ల ఇళ్లల్లో దుర్వాసన వస్తోంది. బురదను, దుస్తులు, సామాన్లను కాలువల్లో పారుతున్న నీటితోనే మహిళలు శుభ్రం చేసుకుంటున్నారు. కచ్చా.. రేకుల ఇళ్లల్లో తేమ తగ్గాలంటే వారం రోజులు పట్టొచ్చు. అంటువ్యాధులు ప్రబలకుండా శ్రీకాళహస్తి, కేవీబీ పురం ప్రాంతాల నుంచి వైద్య సిబ్బంది గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. మందులు అందిస్తున్నారు. ఇక, పశువుల కళేబరాలను ట్రాక్టర్లలో తరలిస్తుంటే రైతులు కుమిలిపోతున్నారు. ముంపునకు గురైన ఈ ప్రాంతాలు తేరుకుని సాధారణ స్థితికి రావాలంటే మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.





గ్రామంలో పారిశుధ్య చర్యలు - తడిసిన పుస్తకాలను ఆరబెట్టుకుంటున్న దృశ్యం

బాధితులకు సాయం

ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు నూనె, పంచదార, కందిపప్పు, చింతపండు, ఉల్లిపాయలు, బంగాళదుంపలతో పాటు రూ.3వేలను అందిస్తున్నారు. పాతపాళెం, అరుంధతివాడ, ఎస్‌ఎల్‌పురం గ్రామాల్లో ఈ సహాయక చర్యలు చేపట్టామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. 457 పశువులు కొట్టుకుపోగా, 26 ఆవులు, 18 గేదెలు, 13 మేకలు చనిపోయాయని పశువైద్యులు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యేలు ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ గ్రామంలో పర్యటించారు. అన్ని విధాలా బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదిమూలం రెండు రోజులుగా కళత్తూరు, పాతపాళెం గ్రామాల్లోనే మకాం వేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డీపీవో సుశీలాదేవి, డీఎల్‌డీవో సుస్మిత, డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డీడీ విక్రమ్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చంద్రశేఖర్‌రావు, ఆశీర్వాదం, కేవీబీ పురం, పిచ్చాటూరు, పరిసర మండలాల అధికారులు గ్రామంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

పంట పెట్టేదెలా?



వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. రాళ్లు చేరాయి. చాలా వరకు కోతకు గురయ్యాయి. ఈ సీజన్‌లో రైతులు పంటలు పెట్టుకునే పరిస్థితి లేదు. ఇసుక మేట తొలగించి.. సాగుకు వీలుగా మార్చుకొనేందుకు సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు నిండు కుండలా ఉన్న రాయలచెరువులో చుక్కనీరు కూడా లేదు. ఈ కట్ట బాగై.. నీళ్లుచేరి సాగుకు అందేది ఎప్పుడోనని ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు.



పొలాల్లో ఇసుక మేటలు

అన్నివిధాలా ఆదుకుంటాం

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం హామీ ఇచ్చారు. ప్రతి గేదెకు రూ.50వేలు, ఆవుకు రూ.40వేలు, మేకలు, గొర్రెలకు రూ.7,500చొప్పున పరిహారం.. ఇళ్లల్లో బురద శుభ్రం చేసుకోవడానికి తక్షణం రూ.10వేలు చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు. ఇల్లు కూలిపోయినట్లయితే పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. పత్రాలు, సర్టిఫికెట్లు పోతే.. మళ్లీ ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇళ్లలో దెబ్బతిన్న ఉపకరణాల వివరాలను సేకరించి ప్రతి ఒక్కరికి నష్టం లేకుండా ప్రభుత్వం సాయం చేస్తున్నారు. మూడు రోజులు పునరావాసంలో ఉండవచ్చని సూచించారు.

మట్టి బలహీనతతో ప్రమాదం

'చెరువు బండ్ కింద మట్టి బలహీనంగా ఉంది. దీంతో గ్రాడ్యువల్ సాయిల్ సీపేజి ఏర్పడి నీళ్లు బండ్ పైకి చేరడంతో ప్రమాదం ఏర్పడింది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఓళ్లూరు రాయలచెరువును శుక్రవారం ఆయన పరిశీలించి, గండి పడిన కారణాలపై ఆరా తీశారు. 'ఉదయం 5 గంటల సమయంలో చేపలు పడుతున్న గ్రామస్తులు నీటిలో బురద కలుస్తున్నట్లు గమనించి సర్పంచి, ఉప సర్పంచికి సమాచారం ఇచ్చారు. వారు 6.30 గంటల సమయంలో చేరుకునే సరికి నీరు బండ్ మీదుగా ప్రవహిస్తోంది. వెంటనే ఇరిగేషన్ అధికారులు యంత్రాలు తెచ్చినా, నీటి ఫోర్స్ చాలా ఎక్కువగా ఉండడంతో కట్టను కాపాడలేకపోయారు. మొత్తం కట్ట తెగిపోయి, కింద గ్రామాలపైకి ఉప్పెనగా నీళ్లు వచ్చి చేరింది' అని కలెక్టర్ వివరించారు. త్వరలోనే చెరువు కట్టను శాశ్వతంగా పూడ్చించే ప్రతిపాదనలు, కొలతలు సేకరించామన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాయలచెరువు ఘటనలో ఏఈ సస్పెన్షన్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయలచెరువుకు గండి పడిన ఘటనలో ఇరిగేషన్ ఏఈ బాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. చెరువుకు గండిపడకుండా ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈ చర్యలు చేపట్టారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

వందేమాతరం



నెరబైలు మోడల్ ప్రైమరీ పాఠశాలలో 150 ఆకారంలో విద్యార్థులు

● 150 ఏళ్ల సందర్భంగా మార్మోగిన నినాదం

శుక్రవారం ఉదయం పది గంటలకు.. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 'వందేమాతరం' నినాదం మార్మోగింది. 150 ఏళ్లయిన సందర్భంగా వందేమాతరం గేయాలాపన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

● ఆయకట్టు భూములకు

'గ్రామకంఠం'గా రిజిస్ట్రేషన్లు

తనిఖీల్లో ఏసీబీ అధికారుల గుర్తింపు

రేణిగుంట నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మూడు రోజులుగా జరుపుతున్న తనిఖీల్లో కీలక డాక్యుమెంట్లను గుర్తించారు. గురువారం ఉదయం చేపట్టిన తనిఖీలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. నిషేధిత జాబితా, దేవదాయ శాఖల భూములు, డబుల్ రిజిస్ట్రేషన్లు 150 వరకు జరిగినట్లు గుర్తించారు. ఇక శుక్రవారం ఉదయం స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా శ్రీకాళహస్తి సమీపంలోని ఓ చెరువు ఆయకట్టు 16 ఎకరాలు ఉండగా అందులోని ఒకే సర్వే నెంబర్‌కు గ్రామ కంఠాలుగా చిత్రీకరించి 200 పైచిలుకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించారని సమాచారం. ముఖ్యంగా తిరుపతి-రేణిగుంట మార్గంలోని ఓ ఆస్పత్రి ఎదురుగా ఉన్న వైఎస్ వ్యక్తిగత అనుచరుడి భూమిని గతంలో విక్రయ రిజిస్ట్రేషన్ చేశారు. అదే భూమిని మరొకరికి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి హయాంలో రిజిస్ట్రేషన్ చేయడాన్ని గుర్తించారు. ఇక ఆనందరెడ్డి వ్యక్తిగత అనుచరుడి వద్ద దొరికిన బ్యాగులోని డాక్యుమెంట్ల ఆధారంగా సూరప్పకశంలో 12 ఎకరాలు, దామినేడులో 3 ఎకరాలు, గాజులమండ్యంలో 34 ఎకరాలు, తిమ్మినాయుడుపాళెంలో 2 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసినట్టు గుర్తించారని తెలిసింది. ఈ భూములు ఎవరి పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యిందో, ఆ పత్రాలను వ్యక్తిగత అనుచరుడు ఎందుకు దాచి పెట్టాడనేది ఏసీబీ విచారణలో వెలుగులోకి రావాల్సి ఉంది. మూడు రోజులు జరిగిన ఏసీబీ తనిఖీల్లో గుర్తించిన పత్రాల ప్రొసీడింగులను సిద్ధం చేసే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నట్టు సమాచారం.

పంటలకు పరిహారం పెంపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దెబ్బతినే పంటలకు పరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంతో పోల్చితే ఆయా పంటలకు రూ.8వేల నుంచి రూ.15వేల వరకు అదనపు పరిహారం అందనుందని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు శుక్రవారం తెలిపారు.



పంట	పరిహారం (రూపాయల్లో)	
(హెక్టార్లలో)	గతం	ప్రస్తుతం
వరి	17వేలు	25వేలు
వేరుశెనగ	17వేలు	25వేలు
అరటి	25వేలు	30వేలు
మిరప	17వేలు	35వేలు
బొప్పాయి	17వేలు	25వేలు
కూరగాయలు	17వేలు	25వేలు
పసుపు	17వేలు	35వేలు
చెరకు	17వేలు	25వేలు
నువ్వులు	8,500	15వేలు
మినుములు	10వేలు	15వేలు

ఎస్వీయూలో చిరుత సంచారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో మళ్లీ చిరుత సంచరించిన ఆనవాళ్లు కనిపించాయి. గురువారం రాత్రి పాపులేషన్ స్టడీస్- ఐ బ్లాక్ హాస్టల్ మధ్య కొత్త భవన నిర్మాణ ప్రాంతంలో కుక్కను తరిమిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో బయట సంచరించరాదని సూచించారు.

సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం



ఎస్వీయూ కృషిలో విజన్-2047 ప్రతిఫలిస్తోంది

● నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్

డాక్టర్ వీకే సారస్వత్‌ను సత్కరిస్తున్న ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ వీసీలు నరసింగరావు, ఉమ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కృషిలో విజన్-2047 ప్రతిఫలిస్తోందని నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ పేర్కొన్నారు. ఎస్వీయూ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం సెనెట్ హాలులో చేపట్టిన కార్యక్రమంలో 'పరిశోధనావిష్కరణలు- ద విజన్ ఆఫ్ వికసిత భారత్' అంశంపై ఆయన ప్రసంగించారు. 2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి ఒక ఆకర్షణీయమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకుందన్నారు. దీనికి అవసరమైన కృషిని దేశంలోని అన్ని సంస్థలు, పౌరులు నెరవేర్చాల్సి ఉందన్నారు. తదనుగుణంగా ఆయా సంస్థలు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కోరారు. అంతరిక్షంలో శాస్త్రీయ సాంకేతిక నాయకత్వం, కృత్రిమ మేధ, బయోటెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పునరుత్పాదక శక్తి, వాతావరణ చర్యతో సహా స్థిరత్వం, గ్రీన్ గ్రోత్, ట్రిలియన్ డాలర్ల డిజిటల్ మార్కెట్‌ను ముందుకు నడిపించే ఏఐ ఆధారిత స్టార్టప్‌లు, డిజిటల్ ఎకానమీ, శక్తిమంతమైన విశ్వవిద్యాలయాల పరిశోధనలు, పేటెంట్లు, యువత నేతృత్వంలో జరిగిన ఆవిష్కరణల వంటివి వికసిత భారత్ లక్ష్యాన్ని నెరవేర్చడానికి దోహదం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. నాణ్యమైన పరిశోధనలు మంచి ఉపాధి అవకాశాలను కూడా సృష్టించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకుల సందేహాలను డాక్టర్ వీకే సారస్వత్ నివృత్తి చేశారు. ఇంక్యుబేషన్ పరిశ్రమ భాగస్వామ్యాలను ఎస్వీయూ విస్తరిస్తున్నట్లు వీసీ నరసింగరావు చెప్పారు. పేటెంట్లు, ప్రోటోటైప్‌లు, స్టార్టప్‌లలో ముగియబోతున్న ప్రాజెక్టులను కొనసాగించడానికి ప్రోత్సహిస్తుందన్నారు. ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలలో స్కాలర్‌షిప్‌లు, మార్గదర్శకత్వం అనుకూలమైన వాతావరణం మెరుగు పడ్డాయని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ తెలిపారు. మన దేశం అంతరిక్ష, బయోటెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, పునరుత్పాదక శక్తి , సెమీకండక్టర్లు వంటి రంగాలలో పురోగతిని సాధించిందని సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ కార్యదర్శి నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంగ్రాయుడు, మాజీ వీసీ మురళి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

తిరుపతి(విద్య), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శుక్రవారం జరిగాయి. డీఈవో ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. 10 విభాగాల్లో 450 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులతో పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన 30 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ వృత్తి విద్య ఉపాధికి పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు ఉపయోగకరమన్నారు. సిమాట్ డైరెక్టర్ మస్తానయ్య మాట్లాడుతూ విద్యార్థులు అభ్యసనంతోపాటు నైపుణ్యాలను సాధించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉప విద్యాశాఖాధికారి ఇందిరాదేవి, బాలల సంక్షేమ, అభివృద్ధి అధికారి పుష్ప, సీఎంవో జి. సురేష్, ఏఎంవో, ఇతర సెక్టోరియల్ అధికారులు, వృత్తివిద్య కోఆర్డినేటర్లు, 90 మంది వృత్తి విద్య శిక్షకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో స్కిల్ కాంపిటీషన్‌ను ప్రారంభిస్తున్న డీఈవో కేవీఎన్ కుమార్

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి



శ్రీనివాసపురంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీని శుక్రవారం ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని రోడ్లను పరిశీలించారు. పంచాయతీ నిధులతో కొత్తగా నిర్మించిన రాయలసీమ-ఓటేరు మార్గంలోని రోడ్డును పరిశీలించారు. రోడ్డుపై వాననీరు నిల్వ లేకుండా ప్యాచ్‌వర్క్‌లు చేయాలని సూచించారు. రోడ్లు, కాలువలు, వీధిలైట్లు త్వరితగతిన వేయాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీలోని తుడా పార్క్ సమస్యలను వాకర్స్ అసోసియేషన్ నేతలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వాకర్స్‌కి అనుగుణంగా రోడ్లు, లైట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. స్థానిక నేతలు గణపతినాయుడు, ఉప సర్పంచ్ సునీల్‌కుమార్ చౌదరి, నాగరాజనాయుడు, బాలాజీనాయుడు, కిలారి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

వేడుకగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ముత్యాలమ్మకు సారె తీసుకొస్తున్న
మాజీ జడ్పీటీసీ సరితారమణమూర్తి, ఎంపీటీసీ ఏసీ శేఖర్

చంద్రగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతేపల్లె పంచాయతీ, నూలివెంకన్న కొత్తపల్లి గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయ పదో వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవంలో మొదటి రోజు సాయంత్రం గణపతి పూజ, స్వస్తివాచనం, ఆలయ శుద్ధి, పంచగవ్య ప్రాసన, దేవతా నాంది, కలశస్థాపన, మంటప దేవతారాధన, మంత్రపుష్పం, నైవేద్యం, మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. మాజీ జడ్పీటీసీ సరితా రమణమూర్తి, ఎంపీటీసీ ఏసీ శేఖర్ అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ కమిటీ వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నూలి వెంకన్ననాయుడు, శెన్నంశెట్టి సుబ్రమణ్యం, గంధం సుబ్రమణ్యం, తొగురు సుబ్రమణ్యం, వరదరాజులు, గండికోట బాబు, జయచంద్రయ్య, శ్రీనివాసులు, రంజిత్, సవరాల శేఖర్, డి.రాజారెడ్డి, జి.మునిచంద్రయ్య, సి.మధు, కే.భాస్కరాచారి పాల్గొన్నారు.

గ్రామీణుల జీవన ప్రమాణాలు పెరగాలి



కావలివారిపల్లె పాతూరులో
వివరాలు సేకరిస్తున్న సావిత్రి

పాకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణుల జీవన ప్రమాణాలు పెరిగేలా అందరూ కృషి చేయాలని పాకాల సింగిల్ విండో ఛైర్‌పర్సన్ కృష్ణమనేని సావిత్రి అన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 సర్వేలో కావలివారిపల్లె పంచాయతీలో ఎన్నికైన 46 పేద కుటుంబాలలో 25 కుటుంబాలను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి బషీరాతో కలిసి సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి



ఆలయం వద్ద కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరి

తిరుచానూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్ పూరి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వాట్సప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి



వాట్సప్ సేవల గురించి వివరిస్తున్న ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సతీశ్‌కుమార్

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నగొట్టిగల్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సతీశ్ కుమార్ అన్నారు. చట్టివారిపాళెం పంచాయతీలో వాట్సప్ సేవల గురించి శుక్రవారం ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల సర్టిఫికెట్లు, కార్యకలాపాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదన్నారు. తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం అవసరమైన డాక్యుమెంట్లు వాట్సప్ ద్వారా సమర్పిస్తే సులభంగా, వేగంగా సేవలను పొందవచ్చునన్నారు. కార్యదర్శి గిరిబాబు, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు చేరిన పర్యావరణ ప్రేమికుడి యాత్ర



సెల్వన్‌కు స్వాగతం పలుకుతున్న
ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సతీశ్ కుమార్

భాకరాపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోకి ప్రవేశించారు. అతనికి ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సతీశ్ కుమార్, డీఏ వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు. రాత్రి చిన్నగొట్టిగల్లు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద బస చేస్తారని వారు తెలిపారు. ముత్తు సెల్వన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం 2021లో సైకిల్ యాత్ర ప్రారంభించానన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న
డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌పై అవగాహన ఉంటేనే ముందుగా గుర్తించి దానికి తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆయన తిరుపతిలోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఐవో శాంత కుమారి, డీఎల్‌ఏటీవో శైలజ, డీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తి నింపాలి



దేశ భక్తి స్ఫూర్తిని చాటుతున్న ఎస్పీ,
పోలీసు అధికారులు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో దేశ భక్తి స్ఫూర్తి నింపాలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. వందేమాతరం గీతం-150వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవిమనోహరాచ్చారి, శ్రీనివాసులు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుడి దర్శనం

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై శివపార్వతుల దర్శనం

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలలో శుక్రవారం శివపార్వతులు సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, ఆనందవల్లిదేవికి అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్ఠించి, ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తులను చంద్రప్రభ వాహనంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.





ముక్కోటిలో సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై దర్శనమిస్తున్న శివపార్వతులు

పెట్టుబడిదారుల పాలనకు సోషలిజమే ప్రత్యామ్నాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు7(ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల విజన్ లాభార్జనేనని, సీఎం చంద్రబాబు చెప్పే వన్ డైరెక్షన్ పనిచేయదని, అందుకు అసలైన ప్రత్యామ్నాయం సోషలిజమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సోషలిజం-మానవ వికాసంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వన్ విజన్-వన్ డైరెక్షన్ విధానంలో అధికారులు పనిచేయాలని చెప్పడం సరికాదన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అది సాధ్యం కాదనే విషయాన్ని సీఎం గ్రహించాలని సూచించారు. లాభాలు ఎక్కడ వస్తాయో అక్కడికి పెట్టుబడిదారులు వెళతారని చెప్పారు. లాభాపేక్ష లేకుండా ముందుకు వెళ్లేది సోషలిజం మాత్రమేనన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగినపుడే పెట్టుబడులు స్థిరంగా నిలుస్తాయని వివరించారు. రాష్ట్రాభివృద్ధికి కమ్యూనిస్టు విజనే ఉపయోగపడుతోందన్నారు. మూడు రోజుల క్రితం అమెరికాలో ట్రంప్ తీసుకుంటున్న పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా 63 శాతం యువత సోషలిస్ట్ భావాల వైపు మొగ్గుచూపిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సదస్సులో సీపీఎం నాయకులు కందారపు మురళి, వి.నాగరాజు, పి.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, మాధవ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యాయసేవా సంఘం సేవలను సద్వినియోగం చేసుకోండి

జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ దేవి



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ దేవి

పాకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల న్యాయసేవా సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పూర్ణిమ దేవి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జడ్జి అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ న్యాయసేవా సంఘం ద్వారా ప్రతి శనివారమూ కోర్టులో సంప్రదించి సేవలు పొందవచ్చన్నారు. రుణాలు తీసుకునేటప్పుడు ఖాళీ ప్రామిసరీ నోటుపై సంతకాలు పెట్టి మోసపోవద్దన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చేసుకున్నా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామని అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదన్నారు. కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వివిధ చట్టాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ రావు, న్యాయవాదులు జి.గురుస్వామి నాయుడు, ఎస్ఎస్ఎం సలీం, జి.చంద్రమోహన్, ప్రవీణ్ ప్రకాష్, సునీల్, సాయి, ఎస్ఐ హరీష్, కానిస్టేబుల్ గురుస్వామి, కోర్టు సిబ్బంది మధు, మీనా తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో నైతిక విలువలు

తిరుచానూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందని, నైతిక విలువలతోపాటు సామాజిక సేవ అలవడుతుందని డీఈవో కేవీఎన్ కుమార్ అన్నారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారత స్కౌట్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డీఈవో మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ గౌరీశంకర్, ఉప విద్యాశాఖాధికారి ఇందిరాదేవి, స్కౌట్స్ కమిషనర్ వంశీరాజా, ఉపాధ్యక్షుడు కుప్పిరెడ్డి, జిల్లా ట్రైనింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఎస్‌వోసీ కోటేశ్వరరావు, కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



హాజరైన స్కౌట్స్ విద్యార్థులు (ఇన్‌సెట్లో)
మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో
ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను ఆదేశించారు. శుక్రవారం చంద్రగిరి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే నాని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కోర్టులో ఉన్న భూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఇంటి పట్టాలు, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పుంగనూరు, తిరుపతి బస్సులు జాతీయ రహదారిలో వెళుతున్నాయని, అవి సర్వీసు రోడ్డులో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్లను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో వెంకటరత్నం, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా స్వర్ణ కాలభైరవ హోమం

రామచంద్రాపు రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయల చెరువుకట్ట శ్రీశక్తి పీఠం లో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వర్ణకాలభైరవ హో మం శాస్త్రోక్తంగా నిర్వ హించారు. మరకతశక్తి కాళీ అమ్మవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9 గంటలకు 11వేల గారెలతో కాలభైరవ హోమాన్ని ప్రా రంభించగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి 12గంటలకు పూర్ణాహుతితో హో మాన్ని ముగించారు. పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసులకు బ్రీత్ అనలైజర్లు పంపిణీ



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడు బ్రీత్ అనలైజర్లు పంపిణీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారు రోడ్లపై కనిపించకుండా గట్టిగా పనిచేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కుంకీలొచ్చినా.. ఆగని గజదాడులు

పలమనేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా రైతాంగానికి కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల దాడులను అరికట్టేందుకు తీసుకొచ్చిన కుంకీ ఏనుగులు అలంకారప్రాయమేనా అన్న అభిప్రాయాలు బాధిత రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏనుగుల దాడులను అరికట్టేందుకు కుంకీ(శిక్షణ పొందిన) ఏనుగులను తీసుకొచ్చే ప్రయత్నాలు చేపట్టింది.కర్ణాటకలో విజయవంతమైన ఈ ప్రయోగాన్ని ఇక్కడ చేపట్టేందుకు అటవీశాఖ మంత్రి అయిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకున్నారు. పలమనేరు మండలంలోని మొసలిమడుగు గ్రామ సమీపంలో కుంకీల నివాసానికి ఏర్పాట్లు చేశారు.ఏడాది కాలంలో ఎలిఫెంట్‌క్యాంపుకు సంబంధించి అటవీశాఖ లక్షలాది రూపాయలను వెచ్చించింది. కుంకీలకు వైద్యసేవలు అందించేందుకు ఒక పశువైద్య అధికారిని నియమించారు, కుంకీలకు ఆహారం తయారు చేసేందుకు ఒక వంటగది, వంట మనుషులను ఏర్పాటు చేశారు. కుంకీలను సంరక్షించే మావటీలకు నివాస సౌకర్యం కల్పించారు. కుంకీలకోసం ప్రత్యేక షెడ్డు నిర్మించడంతో పాటు వాటికి ఆహారం అందించడం కోసం దాదాపు 70 లక్షలతో ఏడాది కాలానికి టెండరు పిలిచారు. కుంకీక్యాంపు ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా కూడా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి అటవీశాఖ అధికారులు ఏడాది కాలంగా తమ సమయాన్ని ఈ క్యాంపు పనులకే వెచ్చిస్తున్నారు.ఎలిఫెంట్ ట్రాకర్స్ సైతం కుంకీల క్యాంపు వద్దే వుంటూ వచ్చారు. క్యాంపు నుంచి కుంకీలను అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు కూడా సిద్ధం చేసి పెట్టారు. ఎలిఫెంట్ క్యాంపుకు ఈ ఏడాది మే నెలలో రెండు, జూన్ నెలలో రెండు కుంకీలను కర్ణాటక నుంచి తీసుకొచ్చారు.కర్ణాటక దుబేరా ఎలిఫెంట్ బేస్ క్యాంపు నుంచి వచ్చిన కుంకీలు ఇక్కడి వాతావరణానికి అలవాటు పడడానికి నెల రోజులు పట్టింది. 17 మంది మావటీలు కుంకీలను వారి స్వాధీనంలోకి తీసుకోడానికి మరో 40 రోజులు పట్టింది. మొత్తంగా 70 రోజుల శిక్షణ అనంతరం ఆపరేషన్ కుంకీని తొలిసారిగా ఆగస్టు ఒకటవ తేదీ సాయంత్రం నిర్వహించారు.టేకుమంద ప్రాంతంలో 8ఏనుగులు తిరుగుతున్నాయన్న సమాచారంతో కుంకీలు కృష్ణ, జయంత్, వినాయక్‌లను తీసుకెళ్లారు. 2వ తేదీ ఉదయానికి ఏనుగులను అటవీ సరిహద్దు ప్రాంతంలోకి పంపడంతో ఆపరేషన్ పూర్తయింది. దీంతో ఈ ప్రాంత రైతులు గజదాడులనుంచి తమ పంటలకు ఇబ్బందులు తప్పుతాయని ఆశపడ్డారు.అయితే ఇప్పటివరకు రెండు మూడు పర్యాయాలు మాత్రమే క్యాంపు నుంచి కుంకీలను చుట్టుపక్కల ప్రాంతాలకు అటవీశాఖ అధికారులు తీసుకురాగలిగారు.



ఎలిఫెంట్ క్యాంపులో సరదాగా కుంకీలు

రోజూ దాడులు జరుగుతున్నా....

చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో ఆరునెలల నుంచి రోజూ ఎక్కడో ఒకచోట చేతికొచ్చిన పంటలను ఏనుగులు నాశనం చేస్తూనే వున్నాయి. 224 హెక్టార్ల వరి,110 హెక్టార్ల టమోటా,200 హెక్టార్ల మామిడి పంటలతో పాటు 600 కొబ్బరి చెట్లు ఏనుగుల దాడిలో దెబ్బతిన్నాయి. పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలు నష్టపోయి వ్యవసాయమంటేనే విరక్తి పుట్టే దశకు చేరుకున్నారు. రొంపిచెర్ల, సోమల, బంగారుపాళ్యం, గంగవరం, పలమనేరు,చంద్రగిరి మండలాల్లో కూడా ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయి. అయినా కుంకీ ఏనుగులను రంగంలోకి దించి గజదాడుల కట్టడికి అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ కుంకీల కోసం ఇప్పటివరకు పెట్టిన ఖర్చు హ్యాంగింగ్ సోలార్ విద్యుత్ కంచెపై పెట్టివుంటే ఎంతోకొంత ప్రయోజనం కలిగేదంటుంటున్నారు.ప్రభుత్వం సోలార్ కంచె ఏర్పాటు చేయకపోయినా 90 శాతం సబ్సిడీ ఇస్తే తామే ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమంటున్నారు.

ఆపరేషన్ కుంకీకి పరిస్థితులు అనుకూలించలేదు : డీఎఫ్‌వో

చిత్తూరు సెంట్రల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం అటవీ పరివాహక ప్రాంతాల్లో తిరుగాడుతున్న ఏనుగుల కట్టడికి అవసరమైన ఆపరేషన్ కుంకీకి తాము సిద్ధమే కానీ అక్కడి పరిస్థితులు అనుకూలించడం లేదని డీఎఫ్‌వో సుబ్బరాజు చెప్పారు. కల్లూరు ప్రాంతంలోని ఏనుగుల గుంపు బలం పుంజుకున్నాయని, ఈ పరిస్థితిలో కుంకీలను అక్కడ ప్రయోగించలేమన్నారు. ఒకటో, రెండో, మహా అయితే ఐదు ఏనుగుల వరకూ తిరుగాడుతుంటే కుంకీల సాయంతో అడవుల్లోకి పంపవచ్చన్నారు. ప్రస్తుతం కల్లూరు ప్రాంతంలో 17 ఏనుగులు గుంపుగా తిరుగుతుండడంతో కుంకీలను ప్రయోగించలేకపోతున్నామని చెప్పారు. ఒకవేళ ప్రయోగిస్తే గుంపులోని ఏ రెండు ఏనుగులైనా కుంకీపై దాడి చేసే ప్రమాదముందన్నారు. ఇది చూసి మిగిలినఈ వాటితో జతకట్టి, కుంకీ ఏనుగులతో పాటు మావటీలను కూడా చంపే అవకాశాలున్నాయన్నారు.లేదా మావటీల కమాండ్‌ను విస్మరించి కుంకీలు అటవీ ప్రాంతంలోని ఏనుగులతో జతకట్టి వెళ్లిపోయే అవకాశాలు కూడా వున్నాయన్నారు. వారం రోజుల్లో గజ యాప్ అందుబాటులోకి వస్తుందన్నారు.

ఘనంగా వందేమాతరం ఉత్సవాలు

చంద్రగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం వందేమాతరం 150వ సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వందేమాతర గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళ్యాణీ డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎ.రంగంపేట కూడలిలో కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు వందేమాతర గేయాన్ని ఆలపించారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతర గేయం విశిష్టతను ప్రిన్సిపాల్ వివరించారు. మిఠాయిలు పంచిపెట్టారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, అగరాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాళ్లు శ్రీప్రకాష్, భక్తవత్సలం మాట్లాడుతూ వందేమాతరం స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరణనిచ్చిన పవిత్ర గీతమని, ఇది జాతి ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మొగరాల జడ్పీ హైస్కూల్‌లో..

పాకాల, (ఆంధ్రజ్యోతి): మొగరాల జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం వందేమాతర గీతం 150 వసంతాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రచయిత బంకిం చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వందేమాతరం గీతాలాపన చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, దేశభక్తి పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు వి.వెంకటసిద్దులు, ఆదికేశవులునాయుడు, రామ్మూర్తి, సుల్తాన్, విమల విక్టోరియా, నీరజ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వందేమాతరం గేయాలాపన చేశారు. మిట్టూరు ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్, విద్యాశాఖ సంయుక్తంగా ఎంఈవో మార్కండేయనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, వందేమాతరం గేయాలాపన చేశారు. వందేమాతరం విశిష్టతను ఎంఈవో విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు విజయకుమార్, అరుణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎర్రావారిపాళెం: మండలంలోని అన్ని పాఠశాలల్లో వందేమాతరం గేయాలాపన చేశారు. మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో వందేమాతరం నినాదాలు చేశారు. నెరబైలు మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు 150 రూపంలో కూర్చుని ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ సరళ మాట్లాడుతూ వందేమాతర గేయం స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో దేశ భక్తులను తయారు చేసిందన్నారు.







ఎ.రంగంపేటలో వందేమాతర ఉత్సవాలు నిర్వహిస్తున్న కల్యాణీ డ్యామ్ పీటీసీ ప్రిన్సిపాల్, సిబ్బంది, గ్రామస్తులు - మొగరాలలో ఉత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు- రామచంద్రాపురం మండలం మిట్టూరులో వందేమాతం గేయాలాపన చేస్తున్న అధికారులు, విద్యార్థులు

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించాలి



కార్యక్రమంలో భూపతి నాయుడు, పత్తిపాటి వివేక్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకొని చికిత్స తీసుకోవాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు కోరారు. ఎస్వీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఎస్వీయూలో హ్యూమన్ రైట్స్ - స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ - ఆకాంక్ష ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన రిజిస్ట్రార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నివారణకు అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. వాతావరణంలో మార్పులు, ఆహారపు అలవాట్లు, ప్లాస్టిక్ వాడకం వంటి కారణాలతో క్యాన్సర్ మహమ్మారికి గురవుతున్నారని చెప్పారు. భయపడకుండా అవగాహన పెంచుకొని సరైన వైద్యం పొందాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.సుధారాణి మాట్లాడుతూ ఎస్వీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్‌ను గుర్తించే విధంగా ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తోందన్నారు. యూనివర్సిటీలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టాటా క్యాన్సర్ ట్రస్టు డాక్టర్ లక్ష్మీ సంధ్య మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు.. ప్రాథమిక దశలో గుర్తించడం గురించి వివరించారు. వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, హ్యూమన్ రైట్స్ అధ్యాపకులు రంజిత్‌కుమార్, రవిబాబు, శ్రీధర్, టాటా ట్రస్టు సిబ్బంది హేమంత్ కుమార్, మహేంద్ర, అమరావతి, అర్చన పాల్గొన్నారు.

ఎస్వీయూలో వందేమాతర గేయాలాపన


కార్యక్రమంలో వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గేయానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు వందేమాతర గేయాలాపన చేశారు. ఇందులో వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. వందేమాతరం దేశ ప్రజల్లో ఐక్యతను, చైతన్యాన్ని తీసుకొచ్చిందన్నారు. అలాగే, యూనివర్సిటీలోని అన్ని కాలేజీలు, విభాగాల్లో వందేమాతర గేయాలాపన చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగాకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా జయంతి సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాలలోని ఆచార్య ఎన్జీ రంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డి శేఖర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీ సుమతి పాల్గొని రైతాంగానికి ఆచార్య ఎన్జీ రంగా చేసిన కృషిని కొనియాడారు. కళాశాల దత్తత గ్రామమైన చంద్రగిరి మండలం డోర్నకంబాలకు చెందిన రైతులను సత్కరించారు. విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంజీ ఇండోర్ స్టేడియం ప్రారంభం


ఇండోర్‌స్టేడియంను ప్రారంభిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (జీవకోన), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం- కాటన్ మిల్లు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంజీ ఇండోర్ స్టేడియంను శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నిర్వాహకులు వెంకటేష్, మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో మంచి శిక్షణ పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తిని గుర్తించి శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అలిపిరి సీఐ రామ్‌కుమార్, కార్పొరేటర్ అన్నా అనిత, ఆర్ఆర్‌యాదవ్, చిరంజీవి, చంద్ర, వెంకీ పాల్గొన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించండి

ఎస్వీయూ రెక్టార్‌కు ఏపీ స్టూడెంట్ జేఏసీ విన్నపం



తిరుపతి (విశ్వ విద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ఎస్వీయూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ నేత శ్రీధర్ కోరారు. రెక్టార్ అప్పారావును కలిసి శుక్రవారం విన్నవించారు. యూనివర్సిటీలో పెండింగ్ ఉన్న పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేయాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం


జల్లిపాటి రవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ పరిశోధకులు జల్లిపాటి రవి డాక్టరేట్ పొందారు. ద ఊరవ్ ఆఫ్ రాజారావు: యాన్ ఓవర్ వ్యూ అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ సుందరవల్లి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. రవి ఇప్పటి వరకూ నాలుగు జాతీయ, నాలుగు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈయన రూపొందించిన మూడు పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

రేపు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆదివారం తిరుపతికి రానున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఆయన మొదటిసారి తిరుపతికి వస్తుండటంతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎస్వీ జూనియర్ కాలేజీ ఎదురుగా (ఎల్‌బీసీ రోడ్డులోని) ఆఫీసర్స్ క్లబ్‌లో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభలో ఈశ్వరయ్యను సన్మానించనున్నారు. ఎస్వీయూలో పీజీ చదువుకున్న ఈశ్వరయ్య అక్కడే ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా పని చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం తన కార్యాలయంలో మధురానగర్‌కు చెందిన భ్రమరాంబకు 1.5లక్షలు, గణేష్‌కు రూ.46వేలు, ఎల్‌బీనగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్‌కు 1.75లక్షలు, మణికంఠకు రూ.50వేలు చెక్కులను అందజేశారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, వెంకటేష్, జానకిరామిరెడ్డి, రాజేష్‌ఆచారి, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా

విశ్రాంత జడ్జి గుర్రప్ప



తిరుపతి అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ ఏపీ కో-ఆర్డినేటర్‌గా విశ్రాంత జడ్జి పెనుమూరు గుర్రప్పను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ప్రకటించారు. ఏడేళ్లుగా ఆయన పార్టీ నిర్మాణం కోసం నిజాయితీగా, అంకితభావంతో పనిచేస్తున్నారని, ఆయన సేవలను గుర్తించి ఈ పదవి అప్పగించామని తెలిపారు. గుర్రప్ప నియామకంపై జిల్లా అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది పేరాల జయచంద్ర అభినందించారు.

అడ్వకేట్‌పై దాడికి యత్నం

పుత్తూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అడ్వకేట్ రాజశేఖర్‌పై క్లయింట్ సాయిప్రసాద్ దాడికి యత్నించిన ఘటన శుక్రవారం పుత్తూరు కోర్టు ఆవరణలో చోటుచేసుకుంది. రామచంద్రాపురం మండలానికి చెందిన దంపతులు సాయిప్రసాద్, హేమలత విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. హేమలత తరఫున రాజశేఖర్ అడ్వకేట్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని విషయాల్లో పరస్పర ఒప్పందం కుదరగా ఆస్తి విషయంలో అడ్వకేట్ కారణంగానే జాప్యం జరుగుతోందని సాయిప్రసాద్ భావించాడు. ఆగ్రహానికి గురై అడ్వకేట్‌పై దాడికి యత్నించాడు. పుత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో

ఇద్దరు విద్యార్థులపై దాడి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) మద్యం మత్తులో ఇద్దరు విద్యార్థులపై దాడి చేసి చితక బాదిన ఘటన శుక్రవారం తిరుపతిలో జరిగింది. ఈస్ట్ ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన ప్రకారం.. చెన్నైలో ఇంటర్ చదువుతున్న వెంకటేష్, ఓం ప్రకాష్ స్నేహితులు. వీరిద్దరూ పెద్ద కాపు లేఅవుట్‌లో ఉన్న తమ స్నేహితుడు సతీష్‌కు ల్యాప్‌టాప్ ఇచ్చి తిరిగి బైకులో వస్తుండగా మద్యం మత్తులో రోహన్, శీను వీరిని ఆపారు. ఎందుకు ఆపారని అడగడంతో దాడి చేసి చితక బాదారు. వీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి


రోడ్డు సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శివజ్యోతినగర్ నుంచి జీవకోనకు వెళ్లే రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఈ రోడ్డును శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది మూసివేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి చేరుకుని పరిశీలించారు. కోర్టు ఆదేశానుసారం రోడ్డు మూసివేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ రోడ్డు ద్వారానే జీవకోన, ఇతర కాలనీలకు వెళ్లేందుకు దగ్గరగా ఉంటుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే స్థానికులకు తెలిపారు. శివజ్యోతినగర్ నుంచి జీవకోనకు వెళ్లేందుకు కరుమారియమ్మ ఆలయం రోడ్డు ఉన్నా ఇరుగా ఉందని స్థానికులు చెప్పగా న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టీడీపీ స్థానిక నేత లోకనాథంయాదవ్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు స్పందన


వినతులు స్వీకరిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ నివాసంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. 50మందికి పైగా అర్జీలు అందజేశారు. పట్నాలు వీధిలోని స్కూల్ విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, వంటగది లేక ఇబ్బంది పడుతున్నారని, పెన్షన్ రావడం లేదని, ముబారక్ స్టోర్ నుంచి గోపాల్ రాజ్ కాలనీ సర్కిల్ వరకు రోడ్లు చాలా ఇబ్బందిగా ఉన్నాయని తెలిపారు. గాంధీపురంలో కాలువలు లేక వర్షం పడినప్పుడు చాలా ఇబ్బందిగా ఉందని, తిమ్మనాయుడుపాలెం హరిజనవాడలో శ్మశాన వాటిక కోసం పలుసార్లు అర్జీలు సమర్పించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. చింతలచేను శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ కట్టాలని కోరారు. అర్జీలను పరిశీలించిన సుగుణమ్మ సంబంధిత విభాగాల అధికారులకు పంపి, సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు శ్రీధర్ వర్మ, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, ఊట్ల సురేంద్ర నాయుడు, కంకణాల రజనీకాంత్ నాయుడు, ముదాల తులసీరామ్, బ్యాంక్ శాంతమ్మ, రేవతి, హేమావతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా ప్రసూతి ఆస్పత్రి


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ప్రమాదాలకు నిలయంగా మారిందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆరోపించారు. ఆస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్యాంటీన్‌తో ప్రమాదం పొంచి ఉందని, వెంటనే దాన్ని తొలగించాలని కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలతో కలిసి ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్నారని, తద్వారా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తల్లీబిడ్డలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని, లేకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, వెంకటనరసింహులు, మల్లికార్జున్, శివబాలాజి పాల్గొన్నారు.

శబరిమలైకు 60 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం పలు స్టేషన్ల నుంచి కొల్లంకు 60 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- మచిలీపట్నం-కొల్లం మధ్య (07101-07102) పది ప్రత్యేక రైళ్లు గూడూరు, రేణిగుంట మార్గంలో రాకపోకలు సాగిస్తాయి. మచిలీపట్నం నుంచి ఈనెల 14, 21, 28, డిసెంబరు 26, జనవరి 2 తేదీల్లో బయలుదేరుతాయి. కొల్లంలో ఈ రైళ్లు ఈ నెల 16, 23, 30, డిసెంబరు 28, జనవరి 4వ తేదీల్లో బయలుదేరుతాయి.
- మచిలీపట్నం-కొల్లం మధ్య (07103-07104) ప్రత్యేక రైళ్లు గుంటూరు, నంద్యాల, కడప, రేణిగుంట, మేల్‌పాకం, కాట్పాడి మీదుగా కొల్లంకు 20 సర్వీసులు నడుస్తాయి. మచిలీపట్నంలో ఈ రైళ్లు డిసెంబరు 5, 12, 19, జనవరి 9, 16 తేదీల్లో బయలు దేరుతాయి. కొల్లంలో ఈ రైళ్లు డిసెంబరులో 7, 14, 21, జనవరిలో 11, 18 తేదీల్లో బయలుదేరుతాయి.
- నరసాపురం-కొల్లం మధ్య (07105-07106) ప్రత్యేక రైళ్లు విజయవాడ, గూడూరు, రేణిగుంట, మేల్‌పాకం, కాట్పాడి మీదుగా కొల్లంకు 20 సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి. నరసాపురంలో ఈ రైళ్లు ఈ నెల 16, 23, 30, డిసెంబరు 7, 14, 21, 28, జనవరి 4, 11, 18 తేదీల్లో బయలుదేరుతాయి. కొల్లంలో ఈ నెల 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో బయలుదేరుతాయి.
- చర్లపల్లి-కొల్లం మధ్య (07107-07108) ప్రత్యేక రైళ్లు పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంట, మేల్‌పాకం, కాట్పాడి మీదుగా 20 సర్వీసులు నడుస్తాయి. చర్లపల్లిలో ఈనెల 17, 24, డిసెంబరు 1, 8, 15, 22. 29, జనవరి 5, 12, 19 తేదీల్లో బయలుదేరుతాయి. కొల్లంలో ఈ రైళ్లు ఈ నెల 19, 26, డిసెంబరు 3, 10, 17, 24, 31, జనవరి 7, 14, 21 తేదీల్లో బయలుదేరుతాయి.

తిరుపతి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్ల రద్దు

తిరుపతి (సెంట్రల్), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి -అనకాపల్లి మధ్య ఆది, సోమవారాల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్లు (07481-07482) రద్దు చేస్తున్నట్లు సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 9, 10, 16, 17, 23, 24, 30, డిసెంబరు 1 తేదీల్లో రాకపోకలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

నాయీ బ్రాహ్మణులకు

కమ్యూనిటీ భవనం ఏర్పాటు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విన్నపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని తిరుపతి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కోరింది. ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సహదేవ జయకుమార్, గల్లా దాము మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్ సెలూన్లను తొలిగించాలన్నారు. లేకపోతే ఎనిమిది లక్షల మంది నిరుపేద నాయీ బ్రాహ్మణులు కులవృత్తిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడోత్సవాలు ప్రారంభం


చిత్తూరు-తిరుపతి మధ్య మహిళల టెన్నికాయిట్ పోటీలు

అనంతపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఏడవ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఇతర అధికారులతో కలిసి సీసీఎల్ఏ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి క్రీడా జ్యోతిని వెలిగించి, పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయపాలన, ఐక్యత, బాధ్యతకు క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో మొదటి రౌండ్‌లో తిరుపతిపై నంద్యాల, చిత్తూరుపై తూర్పుగోదావరి విజయం సాధించాయి.కబడ్డీలో తిరుపతిపై పార్వతీపురం, నంద్యాలపై చిత్తూరు జట్లు విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించాయి. బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో తూర్పుగోదావరిపై చిత్తూరు జట్టు గెలుపొందింది. టెన్నికాయిట్ మహిళల పోటీల్లో తిరుపతిపై చిత్తూరు జట్టు గెలుపొందింది. టేబుల్‌టెన్నిస్ మహిళల విభాగంలో చిత్తూరుపై కాకినాడ జట్టు గెలుపొందగా చెస్ పురుషుల విభాగంలో తిరుపతిపై విజయనగరం, మహిళల విభాగంలో తిరుపతిపై విజయనగరం, చిత్తూరుపై తూర్పుగోదావరి, జట్లు గెలుపొందాయి.

రైతు బజారులో పారిశుధ్య లోపం



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక రాయల చెరువు రోడ్డులోని రైతు బజారులో పారిశుధ్యం లోపించింది. ఎక్కడ చూసినా కూరగాయల వ్యర్థాలు పేరుకు పోయాయి. తాగునీటి కొళాయి వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కు మూసుకుని నీరు తాగాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసనతోపాటు ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో కూరగాయల కోసం వెళ్లిన వినియోగదారులు రోగాల బారినపడే పరిస్థితి నెలకొంది. నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది రోజూ రావడం లేదని, వారికి బుద్ధి పుట్టినప్పుడు వస్తున్నారని, అందుకే పరిస్థితి ఇలా తయారైందని దుకాణదారులు, వినియోగదారులు చెబుతున్నారు.

అమరా ఆస్పత్రిలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభం



ప్రత్యేక ప్యాకేజీ బ్రోచరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవిరాజు తదితరులు

రేణిగుంట నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా అమరా ఆస్పత్రిలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభించారు. రూ.799లకే డయాబెటిస్ హెల్త్ చెకప్ ప్యాకేజీ అందుబాటులోకి తెచ్చారు. ఏపీఏన్‌పీ అధ్యక్షుడు రవిరాజు, ఆర్ఎంఓ అన్నాగౌరీ, డాక్టర్లు వరుణ్, లోకేష్, రమ్య, భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వందేమాతరం భారతీయుల గుండెచప్పుడు

తిరుపతి(జీవకోన), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం భారతీయుల గుండెచప్పుడు అని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతిలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో వందేమాతరం గీతం 150 సంవత్సరాల ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వందేమాతరం నినాదం లేని స్వాతంత్రోద్యమాన్ని ఊహించలేమన్నారు. దాని విశిష్టతను వివరించారు. పాఠశాల అధ్యక్షుడు ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, రవికుమార్, తిరుమలశెట్టి రవిశంకర్, చంద్రశేఖర్, కిరణ్, ప్రొఫెసర్లు కీర్తి వెంకయ్య, చక్రవర్తి రాఘవన్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి(ఆర్టీసీ): స్థానిక ప్రజారవాణాధికారి కార్యాలయంలో శుక్రవారం వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, పీవో చాందిని, ఇతర అధికారులు, సిబ్బంది, సెక్యూరిటీ అధికారులు హాజరై గీతాలాపన చేసి దేశ భక్తిని చాటుకున్నారు.

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): తిరుపతిలోని యూనివర్సిటీల్లో వందేమాతర గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. పద్మావతి యూని వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, విద్యార్థులు, ఉద్యోగులు సామూహిక వందేమాతర గేయాలాపన చేశారు. దేశ ప్రజల సమైక్యతకు ఈ కార్యక్రమం నిదర్శనమని అన్నారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీలో వందేమాతర గేయాలాపన చేపట్టారు. వీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు. వందేమాతరం మన దేశ ప్రజల్లో చైతన్యం కలిగించిందన్నారు.





వందేమాతర ఉత్సవంలో నవీన్‌కుమార్‌రెడ్డి- వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది - పద్మావతి వర్సిటీలో..- సంస్కృత యూనివర్సిటీలో..




శ్రీవారిసేవలో ప్రముఖులు

నీలం సాహ్ని - దివి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ, సెంట్రల్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్ నవీన్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సినీనటి దివి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

'మిట్స్'లో 5,6 తేదీల్లో పాలిటెక్నిక్ అధ్యాపకుల జాతీయసదస్సు

పోస్టర్ ఆవిష్కరించిన ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా

తిరుపతి(విద్య), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని మిట్స్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో డిసెంబరు 5, 6 తేదీలలో దేశవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌పై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం తిరుపతిలోని సాంకేతికవిద్య కార్యాలయంలో ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్, మిట్స్ ప్రతినిధులు జి.శ్రీనివాసులు, కేఎండీ రియాజ్ అలీ ఆవిష్కరించారు. పాలిటెక్నిక్‌లలో ఆఫర్ చేస్తున్న కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) ఎంతో ప్రధానమని ఆర్జేడీ చెప్పారు. ఇందులో భాగంగా అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌పై అధ్యాపకులకు అవగాహన పెంచేందుకు ఈసదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. బోధనలో నాణ్యత పెంపు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. దీన్ని అధ్యాపకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు


గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,718

తలనీలాలు సమర్పించినవారు: 21,937

హస్తకళావిలాసం

గాంధీ శిల్పబజార్

● శిల్పారామంలో 9 దాకానే

తిరుపతి శిల్పారామంలో దేశంలోని విభిన్న హస్తకళలు కొలువుతీరాయి. కళాకారులే స్వయంగా ఇక్కడ తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. 'గాంధీ శిల్ప బజార్ 2025' పేరుతో ఈ నెల 4న తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఈ ప్రదర్శన ప్రారంభం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం, కళా సృష్టి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 దాకా ఈ ప్రదర్శన ఉంటుంది. ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు సందర్శించవచ్చని శిల్పారామం ఏవో సుధాకర్ తెలిపారు. అరుదైన ఎన్నో కళాకృతులు ఇక్కడ లభిస్తున్నాయి. కొన్ని స్టాల్స్‌లో కళాకారులు స్వయంగా తమ ఉత్పత్తులను తయారు చేస్తూ కనిపిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో మాట్లాడే అరుదైన అవకాశం ఇక్కడికి వెళ్తే లభిస్తుంది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి




పుదుచ్చేరి ప్రత్యేకం



పుదిచ్చేరికి చెందిన రాహుల్ కుటుంబం గడచిన 40 ఏళ్లగా కొబ్బరిచెట్టు నుంచి వివిధ కళాకృతులను తయారు చేస్తోంది. కొబ్బరి చిప్పలతో లైటింగ్ ల్యాంప్స్, పిల్లల ఆట వస్తువులు ఈ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

కాశ్మీర్ చీరలు



గాంధీ శిల్పబజార్‌లో కాశ్మీరీ శారీస్ విస్తృతంగా అమ్ముడు పోతున్నాయి. కాశ్మీర్‌కు చెందిన సఫత్ హుస్సేన్ కుటుంబం గడచిన కొన్ని తరాలుగా ప్రత్యేక ఊలుతో చీరలు తయారు చేసి విక్రయిస్తోంది. చాలా అందమైన డిజైన్లలో ఇవి లభిస్తున్నాయి. ధరలు రూ.2వేలు నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి.

మహాబలిపురం ముత్యాలు






మహాబలిపురంకి చెందిన కళాకారుడు కృష్ణన్ స్టాల్‌లో సముద్రంలో సహజసిద్ధంగా దొరికే ఆలుచిప్పలు, ముత్యాలు, పగడాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఒరిజనల్ ముత్యాలు, పగడాలు విక్రయించడం వీరి ప్రత్యేకత. పలు ఆభరణాలు ఉన్నాయి. ఇక చిన్న చిన్న రాతి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఎల్లప్ప టెర్రకోట బొమ్మలు



పలమనేరుకు చెందిన ఎల్లప్ప మట్టితో తయారుచేసిన 500 రకాల టెర్రకోట బొమ్మలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. రకరకాల బొమ్మలు, వాటర్ బాటిల్స్ దీపాలు వంటి మట్టి కళాఖండాలు ఇక్కడ ఉన్నాయి. టెర్రకోట కళాకారుడు ఎల్లప్పకు గతంలో జాతీయ అవార్డు కూడా లభించింది.

- ధర్మవరంకు చెందిన జనార్ధన్ కుటుంబం తయారు చేస్తున్న లెదర్‌పెయింట్స్, డోర్ హ్యాంగిల్స్, లైటింగ్ ల్యాంప్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.
- దేవదారుచెక్కతో వంట సామాగ్రి, వెదురుతో చేసి నీళ్ల గ్లాసులు, టీకప్పులు ఇక్కడ లభిస్తున్నాయి.
- పెన్ కలంకారీకి మన శ్రీకాళహస్తి ప్రసిద్ధి అయితే, బ్లాక్ ప్రింటింగ్‌కి పెడన ప్రత్యేకం. పెడనకకు చెందిన జీవన కుమార్ బ్లాక్ ప్రింటింగ్‌లోని కలంకారీ షర్ట్స్, చీరలు, చున్నీలు విక్రయిస్తున్నారు.




తెల్లజిల్లేడుతో వినాయక విగ్రహాలు

తెల్లజిల్లేడుతో తయారుచేసిన వినాయక బొమ్మలకు మార్కెట్‌లో బహు గిరాకీ ఉంది. జీడీనెల్లూరుకు చెందిన త్యాగరాజులు 20 ఏళ్లగా తెల్లజిల్లేడుతో వినాయక ప్రతిమలను రూపొందించడంలో దిట్ట. ఈ స్టాల్‌లో రూ.120 నుంచి తెల్లజిల్లేడు విగ్రహాలను విక్రయిస్తున్నారు. తెల్లజిల్లేడుతో చేసిన కీచైన్స్ ఆకట్టుకుంటున్నాయి.






ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఎస్.గుణశేఖర్ 2016లో నాగపట్ల ఈస్ట్ బీట్, చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించింది. తర్వాత బెయిల్‌పై ఇతడు బయటకు వచ్చాడు. గత తొమ్మిది సంవత్సరాలుగా వివిధ దశల్లో విచారణలో ఉన్న కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేశారు. ఏడాదిపాటు విచారణ జరిగింది. గుణశేఖర్‌పై సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో ప్రాసిక్యూషన్ వాదనలు విన్న తర్వాత నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ప్రజాప్రతినిధుల పీఆర్వోలు టికెట్లు అమ్ముకుంటున్నారు

● డయల్ యువర్ ఈవోలో భక్తుడి ఫిర్యాదు



డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పాల్గొన్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అధికారులు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొంతమంది ప్రజాప్రతినిధుల పీఆర్వోలు అధిక ధరలకు వీఐపీ బ్రేక్ దర్శనాలను అమ్ముకుంటున్నారని ఈశ్వర్(అనంతపురం) అనే భక్తుడు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫిర్యాదు చేశారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం పలువురు భక్తులు ఈవోతో ఫోన్‌లో సంభాషించారు. ఈ సమయంలో ఈశ్వర్ మాట్లాడుతూ ఒక టికెట్‌ను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్ముతున్నారని చెప్పారు. ఇటువంటి వారిని కట్టడి చేయలని కోరారు. దళారీలపై ఫిర్యాదులు వస్తున్నాయని,విజిలెన్స్ విభాగం చర్యలు తీసుకుంటోందని ఈవో సమాధానం ఇచ్చారు. భక్తులు కూడా దళారీలను ఆశ్రయించకుండా టీటీడీ అధికారిక వెబ్‌సైట్, కౌంటర్ల ద్వారానే టికెట్లు, టోకెన్లు పొందాలని సూచించారు.

డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 17 మంది భక్తులు ఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. దర్శన సమయంలో ఆలయంలోని శ్రీవారిసేవకులు లాగేస్తున్నారని, దర్శన టికెట్ల బుకింగ్ సమయంలో ఓటీపీ ఆలస్యంగా వస్తోందని మణికంఠ(అనంతపురం) ఫిర్యాదు చేశారు. ఓటీపీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అలాగే భక్తులతో మెలిగే విధానంపై శ్రీవారిసేవకులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని ఈవో బదులిచ్చారు. 2023లో ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఎలాంటి నియామకాలు జరగలేదని గణేష్(కడప) ఈవో దృష్టికి తీసుకురాగా, 15 రోజుల్లోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు, వృద్ధులకు ఆఫ్‌లైన్‌లోనూ టోకెన్లు కేటాయిస్తామని బోర్డు ప్రకటించినప్పటికీ చర్యలు తీసుకోలేదని జగన్(జగిత్యాల) తెలుపగా, భక్తుల అభిప్రాయ సేకరణ, కమిటీ సిఫార్సుల మేరకు త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని ఈవో అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి ప్రముఖుల సూచనలను దృష్టిలో పెట్టుకుని వీఐపీలు ఏడాదిలో కొన్ని సార్లు మాత్రమే దర్శనం చేసుకునేలా చూడాలని మునిలక్ష్మీ(తిరుపతి) కోరారు.

బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడింగ్ సమస్య

దర్శన టికెట్లు, టోకెన్ల బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడ్ చేసేలోపు కోటా పూర్తయిపోతోందని హరిణి అనే భక్తురాలి ఫిర్యాదుపై ఈవో బదులిస్తూ.., బుకింగ్ సమయంలో మళ్లీ ఆధార్ అప్‌లోడ్ చేసే అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పేమెంట్ సమయంలో క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించే అవసరం లేకుండా ఆర్బీఐ సూచించిన యూపీఐ, వ్యాలెట్ ద్వారా చెల్లించే అంశాలను కూడా ఐటీ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన వీరరాఘవయ్య ఆస్తి వివాదాల నేపథ్యంలో తన బావమరిది భార్య వెంకటలక్ష్మిపై 2017లో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.



● చిత్తూరులో జోయాలుక్కాస్

బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

ప్రముఖ జోయాలుక్కాస్ సంస్థ చిత్తూరులో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో వినియోగదారులతో పాటు ఏఎస్పీ రాజశేఖర్ రాజ్, నటి దివి వాడ్యా, రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్, రీజనల్ మేనేజరు శ్రీజేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో రూ.72 లక్షల రుణాలు

● జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు సింగిల్ విండో అధ్యక్షుడి ఫిర్యాదు

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తనఖా పెట్టి రూ.72 లక్షల రుణాలు పొందారని సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. '2020 మార్చి నుంచి 2025 ఆగస్టు వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు జరిగాయని, ఈ నెల 4న డీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ బంగారును పరిశీలించగా అందులో వన్ గ్రాము గోల్డ్ ఆర్నమెంట్స్ ఉన్నాయని గుర్తించారు. కె.రెడ్డమ్మ, సి.రుతున్ పేర్లతో 2025 జనవరి 18, 21న, ఫిబ్రవరి 11వ తేదీలలో ఈ ఆభరణాలు పెట్టినట్లు ఉంది' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

తిరుచానూరు వరకే మెము

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే నాలుగు మెము రైళ్లు గురువారం నుంచి ఫిబ్రవరి 5వ తేది వరకు తిరుచానూరు వరకే నడుస్తాయి. అరక్కోణం నుంచి ఉదయం 9.15 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరు వరకే వెళ్తుంది. ఇక, సాయంత్రం 3.40 గంటలకు తిరుచానూరు నుంచే అరక్కోణం బయల్దేరుతుంది. చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 9.50 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరులోనే ఆగుతుంది. అక్కడ్నుంచే మధ్యాహ్నం 1.25 గంటలకు బయలుదేరుతుంది.

ప్రకృతి అందాల మామండూరు

● మరింత అభివృద్ధి చేస్తే పెరగనున్న సందర్శకులు

● నేడు డిప్యూటీ సీఎం పర్యటన



గుంటి మడుగు వాచ్ టవర్‌కు వెళ్లే మార్గం

రేణిగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో.. ప్రకృతి అందాల నడుమ ఉన్న మామండూరు పర్యాటక కేంద్రంలో మరిన్ని వసతులు కల్పిస్తే సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లితుంది. శనివారం రేణిగుంట మండలంలోని మామండూరును సందర్శించనున్న అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ దిశగా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. సెలవు దినాల్లో 700కుపైగా.. సాధారణ రోజుల్లో 130 మంది వస్తున్నారు. ప్రస్తుతానికి 6 కాటేజీలున్నాయి. ఇక, అన్ సీజన్ అయిన ఎండా కాలంలో సందర్శకుల శాతం పెంచేందుకు రిసార్టులు, పిల్లలు ఆడుకునేలా పార్కులు ఏర్పాటు చేయాలి. వారాంతపు సెలవు దినాల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శేషాచలం అటవీ ప్రాంతాల్లో అడ్వెంచర్ల కోసం వస్తుంటారు. వీరికోసం ప్రకృతి బాట నుంచి అభివృద్ధి చేస్తే ఎక్కువగా వస్తారు. ఇక, మామండూరు గెస్టుహౌస్ నుంచి గుంటిమడుగు వద్ద వాచ్‌టవర్‌పై నుంచి ప్రకృతి అందాలు చూడొచ్చు. ఇక, గుంటి మడుగు జలపాతంలో ఎప్పుడూ నీళ్లు ప్రవహిస్తుంటాయి. ఇక్కడికి సందర్శకులను అనుమతించడంలేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుని అనుమతించాలని కోరుతున్నారు. షికారి లైన్, వెద్దురు, మల్లేరు వంక, బ్రహ్మదేవుని గుండం, ఉడగమనుదొడ్డి బేస్ క్యాంప్ ప్రాంతాలకు రోడ్డువేసి జంగిల్ సఫారీకి అనుమతిస్తే సందర్శకులు పెరుగుతారు. శని, ఆదివారాల్లో మామండూరు గెస్టుహౌస్ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తే సందర్శకులకు అనుకూలంగా ఉంటుంది. ఇలా సందర్శకులు పెరిగేలా జిల్లా అధికారుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నది పర్యాటకుల కోరిక.

పవన్ పర్యటనకు భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడు కార్యక్రమాలు.. తొమ్మిది గంటల పాటు సాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో నలుగురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, రోప్ పార్టీలు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు, అటవీశాఖ అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటారు. మామండూరు అటవీ ప్రాంతంలో పవన్ పర్యటన ఉండటంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

తిరుపతిలో గంజాయి బ్యాచ్ వీరంగం

● ఆరు కార్లు, విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ కార్యాలయ అద్దాలు ధ్వంసం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గురువారం అర్ధ రాత్రి గంజాయి బ్యాచ్ వీరంగం చేసింది. సింగాలగుంటలో దాదాపు ఐదారు గంటల పాటు ఆరుగురు యువకులు, విద్యార్థులు హల్‌చల్ చేశారు. కనకభూషణ లేఅవుట్‌లో ఆరు కార్లు అద్దాలు ధ్వంసం చేశారు. పక్కనే వున్న విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ కార్యాలయ కిటికీ అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. సబ్ స్టేషన్ నైట్ షిప్టు ఆపరేటర్ రేవంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చెన్నారెడ్డి కాలనీకి చెందిన ప్రవీణ్, విఘ్నేష్, వేణు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు పదో తరగతి చదువుతున్నారు. మరొకరి వివరాలు తెలియదు. స్నేహితులైన వీరికి మూడు నెలల క్రితం కొంతమంది ప్రత్యర్థులతో గొడవ జరిగింది. దీంతో వారిని టార్గెట్‌గా చేసుకుని కొద్ది రోజులుగా వీరు కనకభూషణ లేఅవుట్‌లో మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్నారు. కొందరు స్థానికులు వీరిని మందలించారు. మళ్లీ గురువారం రాత్రి గంజాయి, మద్యం తాగి.. బీరు బాటిళ్లతో నడి రోడ్డుపై బీభత్సం సృష్టించారు. సబ్‌స్టేషన్ కార్యాలయంపై దాడి చేసి తలుపులు, కిటికీల అద్దాలు పగలకొట్టారు. రోడ్లపై ఆపి వున్న ఆరు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. దీనిపై డయల్ 112కు కొందరు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు ఎస్ఐలు లోకేషబాబు, అజిత, బ్లూకోల్ట్స్, రక్షక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం రెండు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.




పుత్తూరు వార్తలు

చేనేతలకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): చేనేతల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో 75 కుటుంబాలకు ఎమ్మెల్యే నిత్యావసర సరుకులను అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేనేత కార్మికులకు పని ఆగిపోయిందన్నారు. వీరి ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందన్నారు. మొదటి విడతగా ఒక్కో చేనేత కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో చక్కెర, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో పామాయిల్ అందించామన్నారు. 2వ విడతగా మరో 50 మందికి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం సంబరాలు



గీతాలాపనలో విద్యార్థులు



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలందరినీ ఏకం చేసిన ఘనత వందే మాతరం గేయానికి దక్కిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి అన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం శుక్రవారం నాటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... భారత రాజ్యాంగ పరిషత్ వందేమాతర గేయానికి జాతీయ గేయం హోదా కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మన్యం నరసింహులు, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, హరిబాబు, వాణిశ్రీ, సుజన, నరసింహులు, శాంసన్ రాజు, వాసవి, సూర్యబాబు తదితర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సేవకు స్కౌట్స్ అండ్ గైడ్స్ అద్భుత వేదిక

● జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు

పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకునేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ అద్భుత వేదికగా నిలుస్తోందని స్కౌట్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే సందర్భంగా పుత్తూరు పట్టణంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పుత్తూరు సీఐ శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సీఐ మాట్లాడుతూ సేవాభావం, ఆధ్యాత్మిక విలువలు, ఓర్పు, సహనం, సమాజ సేవ వంటి గుణాలు పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందన్నారు. అనంతరం బజారు వీధి, తిరుపతి రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ రెడ్డి రాణి, స్కౌట్ మాస్టర్ అశోక్ కుమార్, రేంజర్ లీడర్లు శైలజ, దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జూడో జట్టుకు విద్యార్థుల ఎంపిక

వడమాలపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అండర్ 17 జూడో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టును చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల, వడమాలపేట విద్యార్థినులు వెన్నెల (36కిలోలు), గీతిక (40కిలోలు), దీపు (63 కిలోలు), అన్నపూర్ణ (70 కిలోలు) విభాగాల్లో ఎంపికయ్యారు. వీరు నవంబరు 8, 9, 10 తేదీల్లో కాకినాడలోని క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో ప్రాతినిధ్యం వహించనున్నారు.

వైభవంగా మహాలింగాకృతి దీపారాధన

వడమాలపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరీశంకర ఆలయంలో నిర్వహిస్తున్న పుష్కర కుంభాభిషేక త్రిదిన మహోత్సవాల్లో సందర్భంగా శుక్రవారం ఉదయం కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం దేవతాపూజ, మృత్యుంజయ పూజ, దుర్గా సప్తపది హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు శివ, సాయి వేద మంత్రోచ్చరణల మధ్య పుష్పం చతుర్వేది కార్యక్రమాలను అందజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలనుఅందజేశారు.

అడ్వకేట్‌పై దాడికి యత్నం

పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అడ్వకేట్ రాజశేఖర్‌పై క్లయింట్ సాయిప్రసాద్ దాడికి యత్నించిన ఘటన శుక్రవారం పుత్తూరు కోర్టు ఆవరణలో చోటుచేసుకుంది. రామచంద్రాపురం మండలానికి చెందిన దంపతులు సాయిప్రసాద్, హేమలత విడాకుల కేసు కోర్టులో నడుస్తోంది. హేమలత తరపున రాజశేఖర్ అడ్వకేట్‌గా వ్యవహరిస్తున్నారు. అన్ని విషయాల్లో పరస్పర ఒప్పందం కుదరగా, ఆస్తి విషయంలో అడ్వకేట్ కారణంగానే జాప్యం జరుగుతోందని సాయిప్రసాద్ భావించాడు. దీంతో ఆగ్రహానికి గురైన సాయిప్రసాద్ అడ్వకేట్‌పై దాడికి యత్నించాడు. ఈ ఘటనపై పుత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. దాడిలో రాజశేఖర్ గాయపడలేదని, హత్యాయత్నం కేసు నమోదు చేయలేమని సీఐ శేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు. రాజశేఖర్ నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

బొజ్జనెత్తంలో పోలీసుల పల్లెనిద్ర

పుత్తూరు అర్బన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జనెత్తం లో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సీఐ శేఖర్‌రెడ్డి, ఎస్ఐ ఓబయ్య ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంజాయి వినియోగంతో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ కానిస్టేబుళ్లు కూడా పాల్గొన్నారు.

భారత కీర్తిని ప్రపంచానికి చాటిన హాకీ: పాశిం

గూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడ మనదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మనదేశంలో హాకీ పోటీలు ప్రారంభమై వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం గూడూరు క్లబ్ ఆధ్వర్యంలో లోగో, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత క్రీడా చరిత్రలో హాకీ ప్రత్యేక స్థానం ఉందన్నారు. 1925లో భారత హాకీ ప్రయాణం మొదలై నేటికి శతాబ్దం పూర్తి చేసుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. 1928లో ఒలంపిక్స్‌లో తొలి స్వర్ణపతకాన్ని సాధించిన ధ్యాన్‌చంద్ ప్రపంచవ్యాప్తంగా భారత హాకీకి గౌరవం తీసుకువచ్చారన్నారు. గూడూరు నుంచి ఎంతో మంది హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దీపక్ ఆకాశ్, స్పర్జన్‌రాజ్, అబ్రహం, వెంకటేశ్వర్లురాజు, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సబ్‌స్టేషన్, మండలంలోని మన్నెముత్తేరి, అట్టకానితిప్ప సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ శేఖర్ తెలిపారు.

తడ: మండలం పరిధిలోని తడ, అక్కంపేట, బీవీపాళెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీఈ శేఖర్ తెలిపారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.00నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ శీనయ్య తెలిపారు.

నేడు అయ్యప్పస్వామి గ్రామోత్సవం

గూడూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీ లేవుట్‌లో అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవంలో భాగంగా శనివారం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు భక్తులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండదీప స్థాపన, కలశస్థాపన, పంచామృతాభిషేకం ఉంటుంది. అనంతరం స్వామివారికి పూలంగిసేవ నిర్వహించి గ్రామోత్సవం జరపనున్నట్లు భక్తులు తెలిపారు.





వర్షంలో బస్సు ఎక్కేందుకు రోడ్డుపైకి వెళుతున్న ప్రయాణికులు - అలంకారప్రాయంగా ఉన్న బస్టాండు

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు

● రోడ్డుపైనే ఆగి వెళ్లిపోతున్న బస్సులు

● ఎండ, వానతో ప్రయాణికుల అవస్థలు

బాలాయపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బాలాయపల్లిలో ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా ఉంది. గూడూరు - వెంకటగిరి మార్గంలోని బాలాయపల్లిలో ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు పాతికేళ్ల క్రితం బస్టాండు నిర్మించారు. ఈ మార్గంలో రోజుకు 40 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఒక్క బస్సు కూడా బస్టాండు ఆవరణలోకి రావడంలేదు. రోడ్డుపైనే ఆగి నేరుగా వెళ్లిపోతున్నాయి. దీంతో బస్టాండులో వేచి ఉండే ప్రయాణికులు బస్సులు ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండులో నుంచి రోడ్డుపైకి వెళ్లేసరికి బస్సులు వెళ్లిపోతుండడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. దీంతో ప్రయాణికులు రోడ్డుకు ఇరువైపులా నిరీక్షించాల్సి వస్తోంది. బస్టాండు ఉన్నా వర్షం, ఎండతో ఇబ్బందులు పడుతూ వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి పక్కనే నిర్మించిన బస్టాండులోకి బస్సులు వెళ్లకపోవడానికి ఇబ్బంది ఏమిటోనని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. రహదారికి అనుకుని నిర్మించిన బస్టాండులోకి బస్సులు వచ్చేందుకు ఎటువంటి అడ్డంకులు లేవు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు బస్టాండు ఆవరణలోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పేదరిక రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల

వెంకటగిరి, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): పేదరికం రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో వరద బాధిత చేనేత కార్మి కుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వం సంకల్పమన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. చేనేతలను ప్రభుత్వం అన్ని విధిలా ఆదుకుంటామన్నారు. అంతకుమందు వందేమాతర గీతాలాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు నరసింహులు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, పప్పు చంద్రమౌళి రెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, జనసేన నాయకులు రామారావు అనిల్, రాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రాయితీ రుణాలు ఇప్పిస్తామని రూ.20 లక్షల టోకరా

నాయుడుపేట టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాయితీ రుణాలు ఇప్పిస్తామంటూ ఓ వ్యక్తి రూ.20 లక్షలు వసూలు చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... బాలాయపల్లికి చెందిన గురుప్రసాద్ ఓ ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్నానని చెప్పుకునేవాడు. నాయుడుపేట, వెంకటగిరి, సైదాపురం, సూళ్లూరుపేట, డక్కిలి, గూడూరు ప్రాంతాల్లో పలువురికి రాయితీ రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. 2022నుంచి 2024 వరకు పలువురి వద్ద నుంచి రూ.20 లక్షలు వసూలు చేశాడు. ఎన్నాళ్లయినా రుణాలు మంజూరు కాకపోవడంతో నాయుడుపేటకు చెందిన ఓ బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు గురుప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా, నగదు వసూలులో ఓజిలి మండలానికి చెందిన ఒక మహిళ గురుప్రసాద్‌కు సహకరించనట్లు విచారణలో తెలిసింది. గురుప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంతో నెల్లూరుకు చెందిన కొందరు బాధితులు నాయుడుపేట పోలీస్‌స్టేషనుకు చేరుకుని ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఉపాధి గ్రామసభలు

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడతావారిపాళెం, తిక్కవరం, వల్లిపేడు, పల్లమాల గ్రామాల్లో శుక్రవారం ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఏపీవో గిరిబాబు మాట్లాడుతూ ఉడతావారిపాళెంలో రూ.2.50 కోట్లు, తిక్కవరంలో రూ.45 లక్షలు, వల్లిపేడులో రూ.54, పల్లమాలలో రూ.45 లక్షలకు పనులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రధానంగా పంట కాలువలు, ఒరవ కాలువల అభివృద్ధి, పశువుల కుంటలు, కోనేరు తవ్వకం, సిమెంటు రోడ్ల నిర్మాణం వంటి పనులను గుర్తించడం జరిగిందన్నారు.

అవి అటవీశాఖ భూములే

డక్కిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం నమశివాయపురం గ్రామంలోని సర్వే నెంబరు 1లోని 243 ఎకరాలు రిజర్వు ఫారెస్టుకు చెందిన భూములుగా నిర్ధారించడం జరిగిందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సదరు భూములు తమకు చెందినవంటూ కొందరు కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఇక మోపూరు క్రాస్ రోడ్డు సమీపంలోని జగనన్న కాలనీలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించామని తహసీల్దారు చెప్పారు.

ప్రైవేట్ పాఠశాలల వాహనాల భద్రతపై నేడు అవగాహన సదస్సు

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల వాహనాల భద్రతపై డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సూళ్లూరుపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్ తెలిపారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 10గంటల హాజరుకావలని కోరారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

గూడూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసముంటున్న సునీల్ గతేడాది సెప్టెంబరు 5వ తేదీన ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న వెంకటేశు, శ్యామ్ ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.

గౌనుకు నిప్పంటుకొని గాయపడిన చిన్నారి మృతి



కావ్య(ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం వెలిగించబోయి గౌనుకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన చిన్నారి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... మండల పరిధిలోని మన్నెమాల గ్రామానికి చెందిన గొట్టికాటి భగవాన్, రమాదేవి దంపతుల కుమార్తె కావ్య(3) గత శనివారం ఉదయం ప్రమిదలో ఉన్న ఒత్తిని వెలిగించబోతుండగా ప్రమాదవశాత్తు గౌనుకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో చిన్నారి శరీరం కాలిపోయి తీవ్రంగా గాయపడింది. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ కావ్య శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

10న లక్ష దీపోత్సవం

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈనెల 10వ తేదీన సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు కన్యకాపరమేశ్వరి వలంటరీ సంఘ అధ్యక్షుడు కాకి శ్రీరామ్మూర్తి తెలిపారు. బహుళ పంచమి సందర్భంగా లక్ష దీపోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణం జరుగుతుందని, భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అపార్ ఐడీ జనరేషన్‌పై దృష్టి పెట్టాలి

తడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులు అందరికీ అపార్ ఐడీ జనరేషన్ చేయాలని ఎంఈవో వేములు అన్నారు. శుక్రవారం చిన్నమాంబట్టు ఉన్నత పాఠశాలలో వందే మాతరం గీతాలాపన చేశారు. అనంతరం మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రీన్ పాస్‌పోర్టు సెల్ఫీ ఫొటో అప్‌లోడ్ చేయడం, క్యాలెండర్ ప్రకారం నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయడంపై ప్రధానోపాధ్యాయులు దృషి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లికార్జునరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల కోసం 50 ప్రత్యేక రైళ్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండుచోట్ల స్టాపింగ్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణమధ్య రైల్వే ఈనెల నుంచి జనవరి వరకు 50 ప్రత్యేక రైళ్లను ఉమ్మడి నెల్లూరు జిల్లా మీదుగా నడుపనుంది. ఈ రైళ్లకు నెల్లూరు, గూడూరులో స్టాపింగ్ ఉంటుంది. ఈరైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం నుంచి కొల్లాంకు (రైలు 07101) నవంబరు 14, 21, 28, డిసెంబరు 26, జనవరి 02 తేదీల్లో, కొల్లాం నుంచి మచిలీపట్నంకు (రైలు 07102) నవంబరు 16, 23, 30, డిసెంబరు 28, జనవరి 04 తేదీల్లో, నరసాపూర్ నుంచి కొల్లాంకు (రైలు 07105) నవంబరు 16, 23, 30, డిసెంబరు 7, 14, 21, 28, జనవరి04, 11, 18 తేదీల్లో, కొల్లాం నుంచి నరసాపూర్‌కు (రైలు 07106) నవంబరు 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30,, జనవరి 06, 13, 20 తేదీల్లో, చర్లపల్లి నుంచి కొల్లాంకు (రైలు 07107) నవంబరు 17, 24, డిసెంబరు 1, 8, 15, 22, 29, జనవరి 05, 12, 19 తేదీల్లో, కొల్లాం నుంచి చర్లపల్లికి (రైలు 07108) నవంబరు 19, 26, డిసెంబరు 3, 10, 17, 24, 31, జనవరి 07, 14, 21 తేదీల్లో రాకపోకలు సాగిస్తాయి.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ పరిధిలోని 38 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.21.79 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గ పరిధిలోని ఇప్పటి వరకు రూ.3కోట్ల వరకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఎవరైనా పేదలు వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతుంటే తమ కార్యాలయంలో సంప్రదిస్తే సీఎం సహాయనిధి నుంచి సాయం అందించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, నరసింహులు, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచు



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, నవంబరు, 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరు పంచాయతీ సర్పంచు పెళ్లూరు షర్మిలారెడ్డి, ఆమె భర్త, వైసీపీ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డిలతో పాటు ఆయన అనుచరులు శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీని సర్పంచు దంపతులు గజమాలతో సత్కరించారు. కప్పగుంటకండ్రిగలోని అనిల్‌కుమార్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కేవీ నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపి, నాయుడుపేట మండల టీడీపీ అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రారెడ్డి, నాయకులు సన్నారెడ్డి, అక్కరపల్లి మాధవరెడ్డి, రవీంద్రారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, శాఖమూరి కృష్ణమ నాయుడు, వెంపళ్ల వెంకటేశ్వర్లు, నరేంద్రయాదవ్, వేణురెడ్డి, వేములయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరా ఆస్పత్రిలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభం



అమరా ఆస్పత్రిలో ప్రత్యేక ప్యాకేజీ బ్రోచరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ రవిరాజు తదితరులు

రేణిగుంట నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా అమరా ఆస్పత్రిలో డయాబెటిస్ హెల్త్ ప్యాకేజీ ప్రారంభించారు. రూ.799లకే డయాబెటిస్ హెల్త్ చెకప్ ప్యాకేజీ అందుబాటులోకి తెచ్చారు. ఏపీఎస్ఏ అధ్యక్షుడు రవిరాజు, ఆర్ఎం ఓ అన్నాగౌరీ, డాక్టర్లు వరుణ్, లోకేష్, రమ్య, భాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం వాయిదా

నాయుడుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకారం వాయిదా పడింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈనెల 8, 9 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటన ఉన్నందున 9వ తేదీ జరగాల్సిన ఏఎంసీ పాలక మండలి ప్రమాణస్వీకారాన్ని ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసినట్లు చైర్మన్ ఉయ్యాల ప్రవీణ తెలిపారు.





చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది - వెంకటగిరిలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో పోలీసుల వందేమాతర గీతాలాపన

వందేమాతరం గేయాలాపన

సూళ్లూరుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వందేమాతరం గేయాలాపన చేశారు. వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి వందేమాతరం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయుల్లో ఉద్యమ కాంక్షను వందేమాతరం గేయం రగిలించిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, ఏడుకొండలు, మధుబాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది, ఎస్‌కేఎల్‌సీఈఎఫ్ పాఠశాల విద్యార్థులతో కలసి వందే మాతరం గీతాలాపన చేశారు. ఎంఈవో నసీం అలీ, ఈవోపీఆర్‌డీ కిరణ్‌కుమార్, ఏవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఏపీవో విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, పట్టణాధ్యక్షుడు దయాకర్ ఆధ్వర్యంలో వందే మాతరం గీతాలాపన చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, రవీంద్రబాబు, నిరంజన్, ఇంద్రవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ గీతాకుమారి, సిబ్బంది వందేమాతర గీతాన్ని ఆలపించారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి: మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో కమాండెంట్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు. అలాగే పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సీఐ రమణ ఆధ్వర్యంలో వందేమాతర గీతాన్ని ఆలపించారు.

యూరియా కొరత లేకుండా చూడండి


చేనేత కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న నరసింహయాదవ్ తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను సత్యవేడు టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తలారివెట్టు సచివాలయంలో రైతులకు యూరియాను యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... రెండ్రోజులుగా సచివాలయం దగ్గర యూరియా కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. అనంతరం కల్లివెట్టు, తలారివెట్టుల్లో వర్షాలకు పని లేక ఇబ్బందులు పడ్డా 40 చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తలారివెట్టులో రూ.20 లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, కాటూరు సహకార సంఘం ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే సీఎంఆర్ఎఫ్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం బాధితులకు ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేశారు. కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుని నయం చేసుకున్న వారికి ఆర్థికసాయం అందించారు. గుర్రప్పనాయుడు కండ్రిగకు చెందిన మునెమ్మకు రూ.34,946, కనపర్తికి చెందిన వంశీరమణకు రూ.1,28,496, చిన్నసింగమాలకు చెందిన కృష్ణయ్యకు రూ.47,377, కొణతనేరికి చెందిన నిర్మలకు రూ.30,028, పూడికి చెందిన స్వాతికి రూ.55,786ను అందజేశారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం



శ్రీకాళహస్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పతి అభివృద్ధి కమిటీ సభ్యుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్‌పై విజయం అనే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. అందులో పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం రౌతు సూరమాలలో తిరుపతి ఐఐటీ ఇంక్యూబేట్ కంపెనీ ఎన్‌జీఈఎన్ వాటర్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకులు అధునాతన కెపాసిటివ్ డీ అయొనైజేషన్ ఆధారిత నీటి శుద్ధీకరణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం బృందమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతల్లో తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలో ఇలాంటి సేవలు అందించడం సంతోషకరమన్నారు. టీడీపీ నాయకులు, ఐఐటీ అధికారులు పాల్గొన్నారు.

సామర్థ్యం పెంపుపై ఆర్పీలకు శిక్షణ


సూచనలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు మెప్మా ఆర్పీలకు సామర్థ్యం పెంపుపై ఒక రోజు శిక్షణ నాలెడ్జ్ పార్ట్‌నర్ అయిన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో జరిగింది. మెప్మా సిటీ మిషన్ మేనేజరు భాస్కర్ మాట్లాడుతూ... ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలకసంఘ పరిధిలో కీలకమైందన్నారు. దీనిపై అవగాహన ఉంటే చెత్త నుంచి సంపద పొందవచ్చన్నారు. రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్, మధురిమ, పురపాలకసంఘ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీపీగా పద్మావతి



వరదయ్యపాళెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఇన్‌ఛార్జి ఎంపీపీగా మాజీ సర్పంచ్, దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసీపీ చేనేత విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు తల్లి పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, బందెల సురేష్, శివయాదవ్, సర్పంచ్ దీపా నరేంద్ర, పోలయ్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

కళత్తూరు బాధితులకు టీడీపీ నేతల భరోసా





తెగిపోయిన చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - ఒకవైపు శుభ్రం చేసుకుంటూ.. మరోవైపు తాగునీటిని పట్టుకుంటూ.. - శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు - విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సత్యవేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కళత్తూరు దళితవాడతో పాటు ముంపునకు గురయిన అన్ని గ్రామాల్లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమైందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బాధిత గ్రామాల్లో పర్యటించిన శంకర్‌రెడ్డి ప్రజలను పరామర్శించారు. ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని వారికి భరోసా కల్పించారు. పలువురు నేతలు తరలివచ్చి గ్రామస్తులను పరామర్శించి వారికి ధైర్యాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ మంత్రి పరసారత్నం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జనసేన నాయకుడు లావణ్యకుమార్, బీఎస్పీ నేత ధనంజయ, స్థానిక నేతలు గోపి, రామాంజులు నాయుడు, గోపినాథరెడ్డి, మునస్వామి యాదవ్, ఇళంగోవన్ రెడ్డి, అయ్యప్పన్, రమేష్ చెప్పారు. గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.



గ్రామంలో పర్యటిస్తున్న శంకర్‌రెడ్డి, టీడీపీ నేతలు - కళత్తూరులో ఎమ్మెల్యే సుధీర్ పర్యటన

తరలివచ్చిన ఆపన్న హస్తాలు

ముంపు ప్రాంతాలైన కళత్తూరు దళితవాడ, పాతపాళెంలోని ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు పలు ప్రాంతాల నుంచి స్వచ్ఛంద సంస్థలు గ్రామాలకు తరలివచ్చాయి. కళత్తూరు దళితవాడలో శ్రీకాళహస్తికి చెందిన శ్రీసత్యసాయి అన్నదాన ట్రస్టు, చెన్నైకి చెందిన పలు మిషనరీలు ఆహార పానీయాలను సరఫరా చేస్తున్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులకు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మునస్వామియాదవ్, ఎంపీడీవో మాలతి, తహసీల్దారు రోశయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలోని రాయలచెరువుకు గండి పడి నిర్వాసితులపై హరిజనవాడ, కళత్తూరువాసులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజలకు నిత్యావసర సరుకులను అందజేశారు.

సర్టిఫికెట్లన్నీ పోయాయి



వరద నీటి ప్రవాహానికి ఇంట్లో ఉన్న ఇంటి పట్టాలు, పాస్‌బుక్‌లు, సర్టిఫికెట్లు అన్నీ తడిసి పోయాయి. నా డిగ్రీ సర్టిఫికెట్లు బురదలో కనిపించకుండా పోయాయి. మా కుటుంబీకుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు కొట్టుకు పోయాయి. ఏ ఆధారం లేకుండా నిలిచిపోయాం.

- మురుగయ్య, కళత్తూరు హరిజనవాడ

సామాన్లు మొత్తం కొట్టుకు పోయాయి



నీళ్లలో ఇంట్లో సామాన్లన్నీ కొట్టుకు పోయాయి. వండుకుని తినేందుకు కూడా గుండాలు లేవు. కొన్ని సామాన్లు పొలాల్లో దొరికాయి. కొన్ని కనబడనే లేదు. గుడ్డలన్నీ బురదలో కూరుకుని పాడైపోయాయి. ఇల్లంతా బురద. కూర్చోడానికి లేకుండా ఉంది.

- బిరుదాల మునెమ్మ, పాతపాళెం అరుంధతి వాడ

ప్రతి ఒక్కరికీ సమ న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బేబిరాణి

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ న్యాయం సమానమని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బేబీరాణి మాట్లాడుతూ.. సమాజంలో బలహీన వర్గాలకు ఉచిత న్యాయసేవలను అందించడానికి, చట్టాలు, న్యాయం తదితర విషయాలపై అవగాహన కల్పించడానికి, వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి 1987లో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ ఏర్పాటైందన్నారు. 1996 నవంబరు 9న వాడుకలోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ఏటా జాతీయ న్యాయ సేవ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో 20మందికి ఉచిత న్యాయం అందించామన్నారు.. అలాగే 95 న్యాయ అవగాహన కార్యక్రమాలు, ప్రతినెలా సబ్‌జైల్ సందర్శన, 395 లోక్ అదాలత్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి కృష్ణప్రియ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ లైన్ల నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం సహా, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పశువుల్లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఏర్పేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. సదాశివపురంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. ఎండీపుత్తూరు పశువైద్యాధికారి శిల్పారెడ్డి వైద్యచికిత్సలు నిర్వహించారు. పశువైద్యులు గ్రామ పెద్దలు హాజరయ్యారు.

ప్రతిభకు అవార్డు

కేవీబీపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పీఈటీ సతీసావిత్రికి శుక్రవారం తిరుచానూరులో జరిగిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్, డీఈవో కేవీఎస్ కుమార్ నుంచి అవార్డును అందుకున్నారు. కేజీబీవీ పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ సుకన్య హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వందేమాతరం గీతం ఆలాపన



బీఎన్‌కండ్రిగ ప్రధాన కూడలిలో, తిరుపతి విమానాశ్రయంలో వందేమాతరం గీతాలాపన

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని ప్రధాన కూడలిలో వందేమాతర గీతాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలకించారు. బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతం గీతం 150 సం వత్సరాలు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వందేమాతరం గీతంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ఎంఈవో మునిసుబ్రమణ్యం, పీఎస్ఐ సుధార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో సిబ్బంది విమానాశ్రయం భవనం ఎదురుగా ఉన్న భారీ జాతీయ జెండా సమీపంలో సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

పరశురామేశ్వరుడి సేవలో ఎస్వీడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు



ఏర్పేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీడబ్ల్యూ కళాశాలకు చెందిన 500మంది విద్యార్థినులు శుక్రవారం గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రిన్సిపాల్ భువనేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులకు స్వాగతం పలికి దర్శనే ర్పాట్లు చేశారు. అనంతరం విద్యార్థులకు ఆలయ ప్రాంగణంలో ఆలయ చరిత్రను అధికారులు వివరించారు.

నిస్వార్థ సేవకు ప్రశంస



రమేష్‌బాబుకు జ్ఞాపిక అందజేస్తున్న డీఈవో

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తిలో 30 సంవత్సరా లుగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో వందలాది మంది విద్యార్థులను చేర్పించి వారిని సామాజిక సేవా కార్యక్ర మాల్లో భాగస్వామ్యం చేస్తూ నిస్వార్థంగా సేవలందిస్తున్న జిల్లా రోవర్ కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబును శుక్రవారం డీఈవో కుమార్ ప్రశంసిం చారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ డేను ఘనంగా నిర్వహించారు.

ఆర్థిక లావాదేవీలతోనే యువకుడి హత్య?

రేణిగుంట, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్య ఆర్థిక లావాదేవీలతోనే జరిగిందనే కోణంలో గాజులమండ్యం పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం ఓ మద్యం దుకాణం సమీపంలోని నిర్మాణంలో ఉన్న భవనంలో హత్యకు గురైన యువకుడి కేసు విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. విచారణలో మృతి చెందిన యువకుడు పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారని సమాచారం. అయితే హత్యకు గల కారణాలు పాత కక్షలు లేదా ఆర్థిక లావాదేవీలనేది పోలీసులు విచారణలో తేలనుంది.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కళత్తూరు ఘటన


కళత్తూరులో పర్యటిస్తున్న చింతామోహన్

శ్రీకాళహస్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు దుర్ఘటన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే జరిగిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపిం చారు. శుక్రవారం ఆయన కళత్తూరు ఎస్సీ కాలనీలో పర్యటించారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు ఎప్పుడూ ఆకాశం వైపు చూస్తుంటారన్నారు. పోలవరం, అమరావతి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, సుందర్ పిచాయ్ గురించి మాత్రమే ఆలోచిస్తారన్నారు. సామాన్యుల వైపు చూడడం లేదన్నారు. అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగి ఉంటే కనీసం 1,500మంది ప్రాణాలు కోల్పోయేవారన్నారు. ఒకప్పుడు మైనర్ ఇరిగేషన్ ఉండేదని ఇపుడు లేదన్నారు. దీంతో చెరువులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆశించిన విధంగా సహాయక చర్యలు లేవని విమర్శించారు. కళత్తూరు ఎస్సీకాలనీని వెంటనే సురక్షిత ప్రాంతానికి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, కూలి రవికుమార్, జనార్దనరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.